# సత్యవాక్కు

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

JULY -1998

# నిత్యము నిలుచునవి

## (Indestructibles)

1. దేవుడు : "ఆదియందు నీవు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీ చేతిపనులే. అవి నశించును గాని నీవు నిలచియుందువు. అవన్నియు వస్త్రమువలె పాతగిల్లును. ఒకడు అంగ వస్త్రమును తీసివేసినట్లు నీవు వాటిని తీసివేయుదువు అవి మార్చబడును నీవు ఏకరీతిగా నుండువాడవు. నీ సంవత్సరములకు అంతము లేదు" (కీర్తన 102:25-27).

2. యేసుక్రీస్తు : "యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకును ఒక్కటే రీతిగా యుండును' (హెబ్రీ 13:8). మనము క్రీస్తుతో కూడ చనిపోయిన యెడల, మృతులలోనుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు, మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వము లేదనియు ఎరిగి, ఆయనతో కూడ జీవించుదుమని నమ్ముచున్నాము" (రోమా 6:8,9).

3. బైబిలు : "సర్వశరీరులు గడ్డియై యున్నారు. వారి అందమంతయు అడవి పువ్వువలె ఉన్నది. యెహోవా తన శ్వాసను దాని మీద ఊదగా గడ్డియెండును పువ్వు వాడును. నిశ్చయముగా జనులు గడ్డివంటి వారే. గడ్డి యెండిపోవును, దాని పువ్వు వాడిపోవును. మన దేవునివాక్యము నిత్యము నిలుచును" (యెషయా 40:7,8).

4. క్రీస్తు రాజ్యము : "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృప కలిగి యుందము. ఆ కృపకలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు" (హెబ్రీ 12:28,29).

యేసుక్రీస్తు ద్వారా బైబిలునందు బయలు పరచబడిన దేవుని చిత్తమునకు లోబడి దేవునికి అప్పగింపబడబోవు రాజ్యములోనికి జన్మించెదము గాక! (యోహాను 3:3-5; 1కొరింథీ 15:24).

- చార్ల్స్ బేరిక్.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884-63722

Editor :

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 18 జూలై 1998 సంచిక 12


## సంపాదకీయం

## నీవు క్రీస్తు సంఘసభ్యుడవా ?

( Are you a member of the Church of Christ ? )

నేడు లోకమందు అనేక సంఘములున్నవను సంగతి మనందరకు విదితమే. వాటిలో ప్రతియొకటి సరియైనదే యని ఆరోపించుకొనుచున్నది, అయితే వాటిలో యేది సరియైనది ? ప్రభువుకు ఒక్క సంఘమే యున్నదా లేక అనేక సంఘములు ఉన్నవా ? క్రైస్తవ్యము పేరట చెలామణియగుచున్న వాటిన్నిటిని ఆయన ఆమోదించునా ? క్రీస్తు విభజింపబడి యున్నాడా ?

### సంఘమునకు నిర్వచనము

సంఘము అనగాభౌతిక భవనమని మానవుడు తలంచుచున్నాడు. గాని సంఘమనగా పిలువబడిన విశ్వాసుల సమూహము, రక్షణ పొందినవారు, క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరము అని లేఖనములయందు ప్రభువు సంఘము వర్ణింపబడినది (1పేతురు 5:10; అపొ.కా. 2:42; 1కొరింథీ 12:27). సంఘము

దాని సభ్యులు క్రీస్తు నామమునే ధరింతురు. వేర్వేరు ప్రాంతములలో యున్న స్థానిక క్రీస్తు సంఘములను గూర్చి చెప్పుచు, పౌలు ఇట్లనెను : "క్రీస్తు సంఘములు అన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16). క్రీస్తు సంఘ సభ్యులై, ఆయనను వెంబడించిన వారందరు క్రైస్తవులని అపొ.11:26, 26:28; 1పేతురు 4:16నందు పిలువబడిరి.

## సంఘము ఒక్కటే

క్రీస్తు ఒకే ఒక్క సంఘమును కట్టెను (మత్తయి 16:18). అది యెరూషలేము పట్టణమందు యించుమించు క్రీ॥శ॥ 33వ సం॥లో ఆరంభమాయెను (అపొ.2). ఆత్మావేశ లేఖకుడు ఎఫెసీ 4:4నందు "శరీరమొక్కటే"యని చెప్పెను. ఈ శరీరము యేమై యున్నది ? ఆనాటి క్రైస్తవులతో అదే లేఖకుడు క్రీస్తును గూర్చి యిట్లు చెప్పుచున్నాడు : "సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" 'ఎఫెసీ 1:22, 23). క్రీస్తును గూర్చి కొలస్సయిలో యున్న సోదరులకు యిట్లు చెప్పుచున్నాడు: 'సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" (కొలస్స 1:18). ఈ వచనములన్నియు మనకేమి బోధించు చున్నవి ? ఒకే శరీర మున్నదని, ఆ శరీరమే సంఘమని, సంఘమే శరీరమని తెలుసుకొని యున్నాము. శరీరము ఒక్కటే, అదియే సంఘమై యున్నది. గనుక సంఘము ఒక్కటే. ఒక్కటేయైన ఆ సంఘము ఏది ? మనము ఇంతకు ముందు చూచిన ప్రకారము క్రీస్తు నామమును ధరించునదియే ఆ సంఘము.

## మరికొన్ని రూపురేఖలు

సంఘమునకు మరికొన్ని రూపురేఖలు కూడా కలవు. సంఘమును సంపాదించుటకు క్రీస్తు తన రక్తమును కార్చెను (అపొ.కా. 20:28). దాని కొరకు ఆయన మృతినొందెను (ఎఫెసీ 5:25). ఇది సంఘము యొక్క విలువను,

విశిష్టతను సూచించును. సంఘము ప్రాముఖ్యము కాదని వాదించువారు అనేకులున్నారు. మానవ కల్పిత సంఘముల విషయములో యది నిజమే కావచ్చును గాని ప్రభువు దాని కొరకు మరణించేటంత మట్టుకు ఇష్టపడినందున అది ప్రాముఖ్యమని విలువగలదని గ్రహింపగుచున్నది. అట్లుగాక మరొక విధముగా ఆలోచించుట క్రీస్తును, ఆయన రక్తమును తిరస్కరించినట్లగును.

సంఘమునకు రక్షకుడు శిరస్సు క్రీస్తే యని చెప్పబడెను. "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:25). క్రీస్తు సంఘమునకు యిహ సంబంధమైన శిరస్సు లేదు గనుక భూసంబంధమైన ముఖ్య కేంద్రమును లేదు. భూమిపై సార్వజనికముగానైనను, స్థానికముగానైనను ప్రభువు సంఘమునకు శిరస్సుగా గాని ఆయనతో హోదాను పంచుకొను తగిన స్త్రీ పురుషులెవరును లేరు. పైగా అట్టి ఆవశ్యకతయును లేదు. క్రీస్తు ఒక్కడు మాత్రమే శిరస్సై యున్నాడు., అందువలన ప్రతి విషయములోను ఆయనకు విధేయులమై యుండవలెను (ఎఫెసీ 5:24). అంతేగాక, క్రీస్తు శరీరమునకు లేక సంఘమునకు రక్షకుడై యున్నాడు. అంటే రక్షింపబడుటకు మనము ఆ సంఘమందు ఉండవలెను. అయితే ఒకడు ఆ సంఘములో ఎట్లు ప్రవేశింపగలడు ? నమ్మి బాప్తిస్మము పొందుట వలన ఒకడు రక్షింపబడును., అప్పుడు ప్రభువు రక్షింపబడిన వానిని ఆ సంఘమునకు చేర్చును (మార్కు 16:16; అపో.కా. 2:47).

## ప్రభువు ఐక్యత కొరకు ప్రార్థించెను

ప్రభువును వెంబడించు వారందురు ఏకమై యుండవలెనని ఆయన ప్రార్థించెను (యోహాను 17:20:23). అపొస్తలుడైన పౌలు కొరింథులో యున్న సంఘమందలి విభజనను ఖండించి, వారందరు విభజింపబడక ఏకభావముతో మాటలాడవలెనని హెచ్చరించెను (1కొరింథీ 1:10-13). వారిలో భేదములను కలుగజేయుటకు కారకులైన వారిని కనిపెట్టియుండుడని క్రైస్తవులను హెచ్చరించెను; అట్టివారు ప్రభువైన యేసుక్రీస్తుకు దాసులు కారని రోమా 16:17,18లో చెప్పెను.

### నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా ?

నా మిత్రుడా, నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా ? బైబిలు బోధించు ఒకే ఒక్క సంఘ సభ్యుడవా ? కానట్లయితే నీవు కాని సంఘములో యున్నావు. ప్రభువు కట్టనటువంటి, దానికొరకు ఆయన మృతినొందనట్టి, రక్షకుడుగా లేనటువంటి, దానికొరకు ఆయన తిరిగి రానటువంటి అసత్య సంఘములో నీవు యున్నావు. సంఘమును గూర్చిన సత్యమును నేర్చుకొనుటకు బైబిలునొద్దకు తిరిగి రావలసినదిగా నిన్ను కోరుచున్నాను. అప్పుడు సత్యమును గ్రహింతువు. దానిని అంగీకరించునట్లును, ప్రభువు నిన్ను రక్షించి ఆయన సంఘమునకు చేర్చునట్లును, నీవు క్రైస్తవుడవు మాత్రమే కాగల్గుటకును ప్రార్థింతుము.

మీ ప్రాంతమందున్న క్రీస్తు సంఘమును దర్శించుము లేదా మమ్మును సంప్రదించుము. నీవు క్రైస్తవుడగుటకు తగు యేర్పాటుజేతుము.

## 1900 సంవత్సరముల పాత సంఘము !

## ( The Church 1900 years old ! )

### వయస్సు ప్రాముఖ్యమా ?

అన్నిటికంటే పురాతన సంఘము ఏది? సంఘవయస్సు అత్యంత ప్రాముఖ్యమైనది. లేఖనములలో చెప్పిన దినమున ఆరంభమైన సంఘము గాక మరేదియు కూడ దైవికమైనది కాదు. ఈలోకములో యున్న 400 డినామినేషనులన్నిటికంటె ముందుగా, 1900 సంవత్సరములకు పూర్వమే స్థాపింపబడిన ఒక సంఘము ఉన్నదని తెలిసికొనుట చాల సంతోషకరమైన సంగతి! అవును, ఈనాడు అందరును దానిలో సభ్యులుగా యుండు తరుణమును కలిగియున్నారు.

క్రైస్తవ లోకములో కనబడుచున్న విభజనలు, జగడములను గూర్చి నేటి లోకము విసుగుచెంది యున్నది. విశ్వాస ప్రమాణిక కర్తలనుండి, పోపులనుండి,

మానవ డినామినేషన్లనుండి ఆదిమ సంఘము నొద్దకు పయనించు ఆశ్చర్యకరమైన ఉద్యమము ఈనాడున్నది. మొదటి శతాబ్దములో దేవుని వాక్యము ఏమిచేసెనో దానినే ఈనాడును చేయగలదు! మనకు అదే ప్రభువు ఉన్నాడు, అదే పరలోక నిరీక్షణ, అదే బైబిలు ఉన్నది. మరియు ఆదిలో వారివలెనే మనము అదే సంఘ సభ్యులము కాగలము. దేవుని కుమారునిచే నిర్మింపబడిన ఆదిమ సంఘములో సభ్యులమై యుండగలమని తెలిసికొనుట ఆనందదాయకము.

## సంఘ జన్మదినము

యేసు పరలోకమునకు ఆరోహణుడైన తరువాత క్రీ॥శ॥ 33వ సంవత్సరమున పెంతెకొస్తు దినము సంఘ జన్మదినము (అపో.కా. 2). క్రీస్తు దాని నిర్మాణికుడు (మత్తయి 16:18). ఆదిలో అది యెట్లుండెను ? ఆరాధనలో ప్రతి ఆదివారము పాటలు పాడుట, ప్రార్ధన చేయుట, వాక్యోపదేశము జరిగించుట, ప్రభురాత్రి భోజనములో పాలుపొందుట కానుకలిచ్చుట జరిగేది (అపో.కా. 20:7; 2:42). బోధలో అయితే దేవుని వాక్యము తప్ప మానవ ప్రమాణములేవి బోధింపబడేవి కావు. పాలనపద్ధతిలో ప్రతి స్థానిక సంఘములో పెద్దలు, పరిచారకులు, పరిశుద్ధులు ఉండేవారు. ఐక్యతలో సంఘము ఒక్కటేయుండెను. రక్షింపబడిన వారందరిని ప్రభువు చేర్చే ఒకే ఒక్క దైవిక సంస్థ యుండేది, అదే సంఘము (అపో.కా. 2:47).

అదంతా ఈనాడు శోచనీయముగా వేరుగా యున్నది. ఇప్పుడు చీలికల సమూహములు ఒక రోగమువలె పెరుగుచు సువార్తకు అభ్యంతరముగ కలుగజేయు చున్నవి. అయితే మిత్రులారా, అందరు ఒకే క్రొత్త నిబంధన సంఘమునకు చెందవలెనని, ఒకే సంగతులను విశ్వసించవలెనని, విభజనలు ఏమియు ఉండకూడదని దేవుని చిత్తమైయున్నది (1కొరింథీ 1:10). ప్రతి సంఘములోను ఒకే సంగతులను బోధించినట్లు పౌలు చెప్పెను (1కొరింథీ 4:17). ఏలయనగా అప్పుడు ఒకే విశ్వాసము, ఒకే బోధ, ఒకే సంఘము ఉండెను.

## ఐక్యతకు మార్గము

అయితే అదెట్లు సాధించగలము ? బైబిలుకు సరియైన ఘనత నిచ్చుటద్వారా సాధించగలము. బైబిలు పరిపూర్ణమైనది, సంపూర్ణమైనది. అది చెప్పుదానిని మనము చెప్పుచేయవలెను. మత సంబంధ విషయాల్లో ప్రభువు చెప్పు మాటల చొప్పున ప్రతివారు జరిగించిన యెడల విభజనల శాపము లోకములో యుండకపోవును. అయితే దేవుని వాక్యములో ఆజ్ఞాపింపబడని సంగతులను కొన్నిటిని ఆరాధనలోను, సంఘపాలను పద్ధతిలోను, నామములలోను, ఆచారముల లోను ఇప్పుడు కనుగొనుచున్నాము. లేఖనములనధిగమించి వెళ్ళుట యనగా దేవుని కోల్పోవుట యని యోహాను చెప్పుచున్నాడు (2యోహాను:9). ఫలాని సంగతిని బైబిలు ఎక్కడ నిషేధించుచున్నది ? యనునది ప్రశ్న కాదు గాని దానిని బైబిలు ఎక్కడ ఆజ్ఞాపించుచున్నది యనునది. నిజముగా బైబిలును సరిగా గౌరవించి, అది అధికారమిచ్చు దానినే జరిగించిన యెడల క్రొత్తనిబంధన సంఘము పునరుద్ధరించబడగలదు. బైబిలు మాత్రమే కేవలము క్రైస్తవులను తయారుచేయును !

ఆదిలో క్రైస్తవ్యము ఆచరింపబడినట్లు మనము ఈనాడు ఆచరించిన యెడల మనము ఏ డినామినేషన్‌కు చెందక క్రొత్తనిబంధన సంఘ సభ్యులై క్రైస్తవులుగా మాత్రమే యుందుము. పౌలు, పేతురు, ఆదిమ క్రైస్తవులు ఏ సంఘమునకు చెందియుండిరి ? వారు ఏ డినామినేషన్‌కు సభ్యులు గాక మన ప్రభువుయొక్క సంఘ సభ్యులైయుండిరి. క్రొత్తనిబంధన సంఘమునకు శతాబ్దముల తరువాత రోమన్ కేథలిక్కులు ప్రొటెస్టాంటు డినామినేషన్లు వుద్భవించెను.

## క్రీస్తు చిత్తము

ఆదిమ సంఘమునొద్దకు మరలవలసినదని క్రీస్తు సంఘములు విజ్ఞాపన చేయుచున్నవి. క్రీస్తు సంఘములు ఒక మతశాఖ గాని, గుంపుగాని కాదు. పరలోక మందును భూమిమీదను వారికి ఉన్న ఒకే శిరస్సు మన యేసుక్రీస్తు ప్రభువు. వారి

ఆరాధన మానవ కల్పితములతో మిళితముగాక దేవుడు బయలుపరచిన ఆరాధనయైయున్నది. వారి విశ్వాస ప్రమాణికము బైబిలు మాత్రమే. బైబిలు తప్ప వేరొకటి ఏమియులేదు.

మానవ నామములతో ముద్రింపబడక, మానవ ప్రమాణికములచే బంధింపబడక క్రైస్తవునిగా మాత్రమే యుండు మార్గమిది. క్రీస్తునందు మానవులందరు ఏకమైయుండు ఐకమత్య బాట యిది.

క్రీస్తు సంఘమును మీరు దర్శించి, పరిశోధించి, దానిని గూర్చి ప్రశ్నలడిగి తెలిసికొనుడని అది మీకు హృదయపూర్వక ఆహ్వానము నందించుచున్నది

-మేక్ లేటన్.

## సంఘము

## ( The Church )

క్రొత్తనిబంధనలో మొట్టమొదటిసారిగా సంఘము అను పదము మత్తయి సువార్తలో మనము చూడగలము. మత్తయి 16:18లో "నా సంఘమును కట్టుదునని" క్రీస్తు చెప్పియున్నాడు. బైబిలునందు చెప్పబడిన సంఘమిదియే.

### సంఘమును గూర్చిన కొన్ని అపోహలు

అబ్రాహాము దినములలోనే ఆ సంఘము స్థాపింపబడినదని కొందరు చెప్పుదురు. క్రీస్తు మత్తయి 16:18లో చెప్పిన వాక్యమును బట్టి అది ఎంతమాత్రమును సత్యము కాదని తెలిసికొనవచ్చును. కొందరు బాప్తిస్మమిచ్చు యోహాను దినములలోనే అది స్థాపింపబడినదని చెప్పుదురు. కాని క్రీస్తు "నా సంఘమును కట్టుదును" అని చెప్పకముందే యోహాను చనిపోయి యుండుటవలన అదియును సత్యము కాదు.

కొందరు పేతురుమీద ఆ సంఘము కట్టబడెనని చెప్పుదురు. "వేయబడినది తప్ప వేరొక పునాది ఎవడును వేయనేరడు. ఈ పునాది యేసుక్రీస్తే" (1కొరింథీ

3:11) అని బైబిలు చెప్పుచున్నందున పైవారు చెప్పు సంగతి సత్యమున కెంతయో దూరముగనున్నది. పేతురు అను బండమీద ఆ సంఘము నిర్మింపబడినదని కొందరు బోధించుదురు. కాని 1కొరింథీ 10:4 ద్వారా ఆ బండ క్రీస్తే అని మనము గ్రహించగలము.

ప్రస్తుత రోజులలోనున్న క్రైస్తవమతశాఖలన్నిటితోను ఆ సంఘము తయారైనదని కొందరు చెప్పుదురు. కాని మతశాఖలుద్భవించుటకు పూర్వము కొన్నివందల సంవత్సరముల క్రితమే ఆ సంఘముండినందున అదియును సత్యము కాదు.

సంఘమునకు క్రీస్తు శిరస్సు అయియున్నాడు. "మరియు సమస్తమును ఆయన పాదముల క్రిందవుంచి సమస్తము పైన ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22,23).

ప్రతి మతశాఖయు దాని స్వంత ప్రధానాధికారిని కలిగిఉన్నది. దాని స్వంత శరీరము కలిగియున్నది. అవి క్రీస్తు శరీరమందలి భాగములు కాక దానికి వ్యతిరేక భాగములై యుండి ఆయన ఎన్నడును అంగీకరించని సేవను ఆయనకు చేయు చున్నవి.

కొందరు ఒక సంఘమునందుండకనే దేవునికి సేవ చేయవచ్చునని కూడా బోధించుదురు. కాని దేవుని వాక్యమిలాగున చెప్పుచున్నది: "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తర తరములు సదాకాలము మహిమ కలుగును గాక. ఆమేన్" (ఎఫెస్సీ 3:21). మనము సంఘమునందుండి క్రీస్తు యేసు మూలముగా ఆయనకు సేవచేయవలెనని ఆయన నియమించి యున్నాడు. కనుక నీవు దేవుని వాక్యము నంగీకరించెదవా ? లేక మానవుని మాటలను విందువా ?

సంఘమనునది ఉండనవసరము లేని యెడల క్రీస్తు చనిపోవలసిన కారణ

మేమి? పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు ఆయన తన రక్తము చిందించి యున్నాడు (మత్తయి 26:28). అనేకులెవరు? "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా నుంచెనో ఆ యావత్తు మందను గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా యుండుడి" (అపొ.కా. 20:28).

"మిమ్మును రక్షించునది సంఘము కాదు" అని తరుచు కొందరు చెప్పుచుందురు. అది సత్యమే! క్రీస్తు యేసునందు తప్ప మరి యితరమైన దానియందు రక్షణ లేదు (అపొ.కా. 4:12). అయినను రక్షింపబడినవారు ఆ సంఘమందున్నారని బైబిలు బోధించుచున్నది. మీరు వివిధ మతశాఖలలో మిమ్మినుగా చేరెదరు. గాని ఆయన తన సంఘమునందు తనకుగా మిమ్మును చేర్చుకొనును.

## సంఘమును గూర్చి క్రొత్త నిబంధన బోధ

రక్షింపబడిన వారిని ఆయన తన సంఘముతో చేర్చును. ఎవరు రక్షింప బడుదురు ? "ప్రకటింపబడు సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింప బడునని" యేసుక్రీస్తు చెప్పియున్నాడు (మార్కు 16:16). ఆయన మరణ పునరుత్థాన వాస్తవములే మొట్టమొదటిగా అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయమందు ప్రపంచమున కీయబడినవి. "కాబట్టి (అతని) వాక్యము నంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు యించుమించు మూడువేలమంది చేర్చ బడిరి" అని అపొ.కా. 2:41లో వ్రాయబడి యుండుట మనము చూడగలము.

క్రొత్త నిబంధన సంఘపు గుణ విశేషములను మనమిపుడు చూతము :

1. దేవుని మందిరము యెరూషలేమునందు స్థాపింపబడవలసియుండెను (యెషయా 2:2-3).

2. ఆ సంఘమునకు శిరస్సు క్రీస్తే. ఆయన దాని పరిపాలనాధికారమును ఎవరికిని, ఎన్నడును ఈయలేదు (ఎఫెస్సీ 1:22,23).

3. బాప్తిస్మము పొందిన విశ్వాసులతో ఆ సంఘము కూడి యున్నది (అపో.కా. 2:41).

4. దానిని ఆయన నీటిద్వారా కడుగుటవలన పరిశుద్ధపరచి ప్రతిష్టించి యున్నాడు. చరిత్ర ప్రకారము క్రొత్త నిబంధనలో చిలకరింపుగాని, కుమ్మరింపుగాని పొందిన వారెవరును లేరు. హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక ద్వారా మనకొక గొప్ప యాజకుడు (యేసుక్రీస్తు) దేవుని మందిరము (సంఘము) నందున్నాడని తెలిసికొనగలము (1తిమోతి 3:15). మనము క్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటచే యధార్థ హృదయము, సంపూర్ణ విశ్వాసము కలిగి నిర్మలమైన ఉదకములో కడుగబడిన వారమై దేవుని సన్నిధానమునకు చేరుదుము (హెబ్రీ 10:19-22).

5. ఆ సంఘము ప్రవక్తల యొక్కయు, అపొస్తలుల యొక్కయు పునాదుల మీద క్రీస్తు యేసు మూలరాయి అయి యుండగ నిర్మింపబడెను (ఎఫెస్సీ 2:20).

6. "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు. ఈ పునాది క్రీస్తే" (1కొరింథీ 3:11). క్రొత్తనిబంధన సంఘము ఒక సూక్ష్మమైన దేవుని సంస్థ. దీనియందిహలోక అధికారులు లేరు. అది ఒక మతశాఖకాదు. ప్రతి వ్యక్తిగత స్థానిక సంఘము క్రీస్తునందు స్వేచ్ఛను కలిగియున్నది. ఆయన పునరుత్థానముకు అపొస్తలులే సాక్షులు.

స్థానిక సంఘముల యందు పెద్దలు, పరిచారకులు ఉందురు. క్రొత్తనిబంధన సంఘము దీనిని తప్ప మరియే యితర ప్రభుత్వమును ఎరుగదు. ప్రభువుమార్గము యధార్థమని నమ్ముచున్నాను. నీవు కూడా నమ్ముచున్నావా ?

# రక్షింపబడుటకు ఒకడు క్రీస్తు సంఘములో యుండవలెనా ?

## ( Must one be in the Church to be Saved ? )

ఇది అతి ముఖ్యమైన ప్రశ్నయై యున్నది. ఇందును గూర్చి సరియగు జవాబును దైవగ్రంధమైన బైబిలు మాత్రమే ఇయ్యగలదు. అబద్ధ మాడనివాడు దేవుడు మాత్రమే యని రోమా 3:4లో వ్రాయబడినది, గాన దైవగ్రంధము పరిశోధించుట యుక్తము.

### నయమాను ఒక ఉదాహరణ

2రాజులు 5:12లో కుష్ఠరోగియైన నయమాను ఇట్లనుచున్నాడు : దమస్కు నదులైన అబానాయును ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటికంటె శ్రేష్టమైనవి కావా ? వాటిలో స్నానము చేసి శుద్ధి నొందలేనా ? అనుకొని రౌద్రుడై మరలిపోవు చుండగా అతని దాసులలో ఒకడు వచ్చి- " ఆ ప్రవక్త యేదైన నొక గొప్ప కార్యము చేయుమని నియమించిన యెడల నీవు చేయకుందువా ? అయితే స్నానము చేసి శుద్దుడవు కమ్మనుమాట దాని కంటే మేలుకాదా ? అని చెప్పినప్పుడు అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడు మారులు మునగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్దుడాయెనని 2రాజులు 5:13,14లో చదువుచున్నాము. నయమాను ప్రవక్త చెప్పినట్లు యొర్దాను నదిలో 7సార్లు మునుగుటకు నిరాకరించి, తాను తలంచినట్లు యింకా శ్రేష్ఠమైన యితర నదులలో ఎన్నిసార్లు స్నానము చేసి వుండినను, అతని కుష్ఠరోగము పోయి శుద్దుడగునా ?

### నోవహు మరియొక ఉదాహరణ

ఆదికాండము 6,7 అధ్యాయములలో తాను సృజించిన అప్పటి లోకము పాపముతో నిండి యుండగా దేవుడైన యెహోవా సంతాపము నొందిన తన హృదయములో నొచ్చుకొని లోకమంతటిని జలప్రళయములో ముంచి సర్వమును

నాశనము చేయబూని, ఆ తరములో నీతిమంతుడుగా ఉండిన నోవహుతో చితిసారకపు మ్రానుతో ఒక ఓడను చేసికొనుమని ఆజ్ఞాపింపగా నోవహు యావత్తు దేవుడు చెప్పినట్లు చేసి ఆ భయంకరమైన జలప్రళయము నుండి తాను తన కుటుంబమును రక్షించుకొనినట్లు చదువుచున్నాము. నీతిమంతుడైన నోవహు రాబోవు ఉగ్రత నుండి తప్పించుకొనుటకు ఓడలోకి రమ్మని ప్రకటింపగా ప్రజలు నమ్మక హేళనచేసి వారందరు నాశనమైరి. నీళ్లురాగా వారిలో అనేకులు, మిద్దెలు, మేడలు, కొండలు, పర్వతములు ఎక్కి ప్రాణములు దక్కించుకొన ప్రయత్నించి వుండవచ్చును. గాని మానవుల ప్రయత్నములు నిలిచెనా ? దేవుని ఆజ్ఞ ప్రకారము ఓడలో వున్న ఆ ఒకే ఒక్క కుటుంబము మాత్రమే రక్షింపబడెను. అందరు జలప్రళయములో మునిగి నాశనమైరి.

ఆలాగే ఈ కడవరి దినములలో దయగల దేవుడు సర్వలోకమును తన ఉగ్రత నుండి తప్పింపనెంచి తన ప్రియకుమారుని యీ లోకమునకు పంపి లోక పాపభారము నంతయు తన కుమారుడైన క్రీస్తుపై మోపి ఆయన రక్తము ద్వారా పాపములకు విరుగుడు దయ పాలించి ఆయన ద్వారా మానవ రక్షణార్ధము ఒక సంఘమును నిర్మింపజేసెను.

అపొ.కా. 2వ అధ్యాయములో సంఘము ఉద్భవించెను. క్రీస్తు మత్తయి **16:18** లో సంఘమును కట్టుదునని వాగ్దానము చేసెను. 3000మందితో సంఘము ప్రారంభమాయెను. యేసు తనకు విధేయులైన వారిని తానే తన సంఘములో చేర్చుచున్నాడు (అపొ.కా. 20:28). ఆయనే దాని శిరస్సు (ఎఫెస్సీ 5:23,24). ఆయనే దాని సంరక్షకుడు.

ఆ ఏకైక సంఘములో క్రీస్తు ద్వారా ప్రవేశించి ఆనందించుమని ఆయన పేరట ప్రేమపూర్వకముగా మిమ్ము వేడుకొనుచున్నాము.

**B.** లాజరస్, రాజమండ్రి.

## క్రీస్తు సంఘమును దర్శించునపుడు నీవేమి కనుగొందువు

### ( What to expect when you visit the Church of Christ )

దేవుని ఆయన కుమారుడైన యేసుక్రీస్తుద్వారా ఆరాధించుటకు కూడియున్న క్రైస్తవులను నీవు కొనుగొందువు. ఈ ఆరాధనలో పరిశుద్ధ లేఖనములు చదువబడుట, ప్రార్థన చేయుట, పాటలు పాడుట, ప్రభురాత్రి భోజనము నాచరించుట, కానుక లిచ్చుట జరుగును. మొదటి శతాబ్దపు క్రైస్తవులను క్రీస్తు నడిపించినట్లుగా ఈ క్రైస్తవులు ఆరాధింతురు (యోహాను 4:24; 2తిమోతి 2:15; 1తిమోతి2:8; ఎఫెసీ 5:19; అపొ.కా. 20:7; 1కొరింథీ 16:1,2).

ఆత్మావేశ దైవలేఖనముల యెడల సంపూర్ణ భయభక్తులు ఈ సంఘములు కలిగయుండుట నీవు చూడగలవు. నేటి భక్తి విషయాల్లో అది ఒక్కటి మాత్రమే సంపూర్ణాధికారమును కలిగియున్నది. "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్టు బోధింపవలెను" (1పేతురు 4:11). ఒకే నియమమును బట్టి మనందరము నడుచు కొనవలెను (ఫిలిప్పీ 3:16). దేవుని వాక్యము సర్వ సంపూర్ణమైన విశ్వాస నియమమని క్రీస్తు సంఘములు అంగీకరించును గనుక మానవ ప్రమాణికములను అన్నిటిని వారిని నిరాకరించుట నీవు చూడగలవు (గలతీ 1:8,9, ప్రకటన 22:18,19).

"ఈ బండమీద నా సంఘమును కట్టుదును' అని క్రీస్తు ప్రకటించినందున (మత్తయి 16:18), క్రీస్తు సంఘములు ఆయనకే చెందినట్టివని గుర్తించబడెను (రోమా 16:16). ఈ సంఘములలో ప్రతివాడు ప్రభువు ఆజ్ఞలకు లోబడవలెనని వేడుకొనబడుట నీవు కనుగొందువు: అవి క్రీస్తునందు విశ్వాసముంచుము (యోహాను 8:24), మారుమనస్సు పొందుము (లూకా 13:3), క్రీస్తును ఒప్పుకొనుము (మత్తయి 10:32), క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుము (మార్కు 16:16; అపొ.కా. 2:38) అనునవి. క్రైస్తవుడుగాను, ప్రభువు సంఘసభ్యుడుగాను అగుటకు ఈ ఆజ్ఞలకు లోబడవలెను. క్రైస్తవులయిన తరువాత క్రొత్త నిబంధన నడిపించురీతిగ

ఈ శిష్యులు ప్రభువును నమ్మకముగా ఆరాధించుచు, సేవించుచు యుండవలెను.

క్రీస్తును వెంబడించు వారందరు క్రొత్తనిబంధనలో బయలు పరచబడిన రీతిగా ఆదిమ క్రైస్తవ నమూనా యొద్దకు మరలుడి యని సువార్త బోధకులు విజ్ఞాపన చేయుట నీవు కనుగొనగలవు. రాజ్యము యొక్క విత్తనము దేవుని వాక్యము గనుక (లూకా 8:11), మనుష్యుల హృదయములలో అది ఒక్కటి మాత్రమే నాటబడినప్పుడు మొదటి శతాబ్దములో అది యెట్టి ఫలితముల నిచ్చెనో అదే ఫలితములను ఇప్పుడును ఈయగలదని వారి నమ్మకము! ఆ ఫలితము క్రొత్త నిబంధన క్రైస్తవ్యమగును.

దేవుని సేవించు ఈ ప్రాథమిక పద్ధతిని క్రీస్తు సంఘములు అందరికి అందియ్య గోరుచున్నవి. క్రీస్తునందు క్రైస్తవ ఐక్యతకు సహవాసముకు ఇది ఒక్కటి మాత్రమే సరియైన జవాబు అని ఈ క్రైస్తవుల విశ్వాసము (ఎఫెసీ 4:5; 1కొరింథీ 1:10).

## క్రీస్తు సంఘ సభ్యులు కాకుండ రక్షణ పొందగలమా ?

**( Can one be saved without being a member of the Church of Christ ? )**

ప్రపంచము నందలి భక్తిగల ప్రజలు, భారతదేశములో గల వివిధ మతస్థులు, తమ తమ మత నియమములను, సిద్ధాంతములను పాటించిన యెడల మోక్షము పొందగలమని నమ్ముచున్నారు. అనగా మంచి కార్యముల చేత ఒకడు మోక్షము సంపాదించవచ్చునని వారి భావము.

అదే విధముగా మన దేశములోను, ప్రపంచమంతటను గల మతశాఖల ప్రజలు (కేథలిక్కులు, ప్రొటెస్టాంటులు) వారి వారి శాఖల సిద్ధాంతములను, బోధలను అనుసరించిన యెడల రక్షణ పొందగలమని నమ్ముచున్నారు. అనగా దేవునియందు విశ్వాసమున్నంత వారకు వారు ఏ శాఖకు సంబంధించినవారైనను పరవాలేని వారి భావము.

అయితే మానవ రక్షణకు మరియు సంఘ సభ్యత్వమునకు గల సంబంధమును గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నదో పరిశీలింతము.

**I. బైబిలు సంఘము మరియు మానవుల రక్షణ :**

A. దేవుడు బైబిలునందు ఒక సంఘమును తెలియజేశాడు. (మత్తయి 16:18; రోమా 16:16).

B. క్రీస్తు ఆ సంఘమునకు శిరస్సై యున్నాడు. (ఎఫెసీ 1:22,23; 4:16; కొలస్స 1:18).

C. క్రీస్తు ఆ సంఘమునకు రక్షకుడై యున్నాడు. (ఎఫెసీ 5:23; కొలస్స 1:18,24).

D. రక్షింపబడిన వారిని క్రీస్తే తన సంఘమునకు లేక రాజ్యమునకు చేర్చును (మార్కు 16:16; అపొ.కా. 2:41, 47; యోహాను 3:3-5).

E. క్రీస్తు సంఘము దేవుని యొక్క కుటంబము లేక మందిరమై యున్నది (1తిమోతి 3:14, 15; 1పేతురు 2:4, 5; హెబ్రీ 3:6).

పై విషయములు మనసునందుంచుకొని ఈ దిగువ ప్రశ్నలను పరిశీలించుము.

1. సంఘములో లేనివారు రక్షింపబడ్డారా ? (అపొ.కా. 2:47).
2. సంఘములో లేనివారు క్రీస్తు రక్తములో తమ పాపములు కడిగి వేసుకున్నారా ? (అపొ,కా. 22:16; 20:28; 1పేతురు 2:21-25).
3. క్రీస్తు సంఘములో లేనివారు పరలోక రాజ్యములో నున్నారా ? (యోహాను 3:3-5; అపొ.కా. 2:41,47; 20:28; ప్రకటన 1:6; 5:1).
4. సంఘములో లేనివారు క్రైస్తవులా ? (అపొ.కా. 11:26; 1కొరింథీ 12:12-27).

అయితే రక్షింపబడుటకు ఏ శాఖలో నుండినను పరవాలేదని నీవు అనుకొనవచ్చును. మరియు దేవుని యందు విశ్వాసముంచి, బైబిలు చదివి, దేవునికి ప్రార్థన చేస్తే చాలు రక్షింపబడవచ్చునని నీవు తలంచవచ్చును. అలాగైన యెడల బైబిలు లేకనే, క్రీస్తు రక్తము లేకనే రక్షణ పొందవచ్చును. అయితే అట్టిది అసాధ్యము.
మన రక్షణకు సంఘ సభ్యత్వము ప్రాముఖ్యము కానియెడల :-

1. దేవుడు బైబిలునందు ఒక సంఘమును ఎందుకు కనుపరచాడు ?
2. క్రీస్తు ఆ సంఘము కొరకు ఎందుకు చనిపోయాడు ?
3. పరిశుద్ధాత్ముడు ఆ సంఘమును గురించి లిఖించుటకు అపొస్తలులను ఎందుకు ప్రేరేపించాడు ?
4. అపొస్తలులు మరియు మొదటి శతాబ్దమునందలి క్రైస్తవులు ఎందు నిమిత్తము ఆ సంఘ సభ్యులయ్యారు ? కావున రక్షింపబడ వలయునంటే తప్పక క్రీస్తు సంఘ పభ్యులు కావలెను.

## II. క్రీస్తు వంఘ సభ్యులగుట ఎట్లు ?

A. సువార్త వినవలెను (రోమా 10:17; యాకోబు 1:22-25).

B. దేవునియందు విశ్వాసముంచవలెను (హెబ్రీ 11:6; యోహాను 8:24; 14:1; యాకోబు 2:14-26).

C. పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (లూకా 13:3,5; అపొ.కా. 17:30; 2:38).

D. క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను (మత్తయి 10:32,33; రోమా 10:9,10).

E. బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16; అపొ.కా. 2:38; 1పేతురు 3:21).

చివరిగా వివిధమతస్థులు, మతశాఖల ప్రజలు రక్షింపబడవలయునంటే వారి వారి మత సిద్ధాంతములను వదలి బైబిలునందు దేవుడు కనుపరచిన సంఘ సభ్యులు కావలెను. ఆలాగు చేసి, పరలోకమందు దేవునితో నిత్యజీవము ననుభవింప వలయునంటే మరణము వరకు విశ్వాసనీయమైన క్రైస్తవ జీవితము జీవించవలెను (ప్రకటన 2:10).

- D. ఎలీషా, గోవా.

## లేఖనానుసారమైన నామము

**( The Scriptural Name )**

పరలోకమందున్న దేవుడు ఉద్దేశించిన నామమును పెట్టుకొనుట సరియైనది ఎందుకనగా దేవుని చిత్తమును జరిగించినచో దేవుడు సంతోషించును. భూలోకములో ఆయన నామమును ధరించుకొనుట అత్యుత్తమము.

మానవులు ప్రవేశపెట్టిన పేర్లు దేవుని దృష్టికి అంగీకారయోగ్యము కాదు. మనుష్యులు వారికి తోచిన విధముగా నామములు ధరించుకొనుట వలన చీలికలు, కలహములు ఏర్పడుచున్నవి. ఆలాగు అందరూ భేదములు పెంచుకుని వేరగుటలో క్రీస్తు చేసిన ప్రార్ధనను ప్రజలు సమూల ధ్వంసము చేసినట్లుగా కనబడుచున్నది (యోహాను 17:20,21). భేదములు, కక్షలు, కలహములను అపొస్తలుడైన పౌలు నిశితముగా విమర్శించెను (1కొరింథీ 1:10-15). కొందరు వ్యక్తుల పేర్లను ఘనపరచుచు పెట్టుకున్న పేర్లు ఆ వ్యక్తుల్నే ఘనపరచును. దీనికి లూథరన్ సంఘము ఉదాహరణముగా నున్నది. సంఘపరిపాలనా విధానమును అనుసరించి పెట్టుకున్న నామము పాలనా విధానమునే తప్ప దేవునిని ఘనపరచదు. ఈలాగు మెథడిస్టులు, ప్రెస్బిటేరియన్లు దేవునికి దూరముగా నున్నారని నిస్సందేహంగా చెప్పగలం, అవిశ్వాసులకు ఎదురుగా తబ్బిబ్బులు, సందేహములు కల్గించి, ఏ సంఘమునైనా దేవుడు మెచ్చుకొనును అని చాటించుట కేవలము వారికి అడ్డుబండలుగా నిలుచుటయే అగును. ఆ విధముగాకాక క్రీస్తు నామును ధరించి, అనేక జనులనాకర్షించుటయే క్రీస్తు సంఘ ఉద్దేశ్యము.

యెహోవా నియమించిన క్రొత్త నామము మనము ధరించవలెనని దేవుని ఆశయము (యెషయా 62:2). అన్యజనుల యెదుటను రాజుల యెదుటను, ఇశ్రాయేలీయుల యెదుటను ఆయన నామమును భరించి ఘనపరుచుటకు పౌలు పిలువబడెను (అపొ.కా. 9:15). అన్యజనులు దేవుని మహిమను చూచిన అనంతరము క్రీస్తు నామమును ధరించుట జరిగెను (యెషయా 62:2). ఈ సంగతి, అన్యుడైన కొర్నేలీ విషయములో నెరవేరినది. కొర్నేలీ క్రీస్తు మహిమను చూచినాడు (అపొ.కా. 11:26). అన్యజనులు ఆయన నామయమును ధరించుటకు వెనుకాడలేదు (అపొ.కా. 15:17). క్రైస్తవుడు అను నామము ధరించవలెనని పౌలు అగ్రిప్పకు బోధించుటను బట్టి, వెంటనే అగ్రిప్ప, ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే అని పౌలును నివారించెను (అపొ.కా. 26:26-28). కాని ఆ నామములోనున్న శ్రేష్ఠత్వమును అగ్రిప్ప అర్ధము చేసికొనలేకపోయెను (యాకోబు 2:7). శ్రమలలోను, బాధలలోను మనము ఆ నామును మహిమ పరచుటయే, లేక పైకెత్తుటయే ఆయన చిత్తమై యున్నది (1పేతురు 4:14-16).

**సంఘమునకు అన్వయించబడిన సామాన్య నామములు :-**

దేవుని సంఘము 1కొరింథీ 1:2, క్రీస్తు సంఘములు (రోమా 16:16) కొన్నిసార్లు దేవుని రాజ్యమని (మత్తయి 13:24), క్రీస్తు శరీరమని (ఎఫెసీ 1:22,23), దేవుని మందిరమని (1తిమోతి 3:15) పిలువబడెను. సంఘములోని సభ్యులు క్రైస్తవులు (అపొ.కా. 11:26), పరిశుద్ధులు (ఫిలిప్పీ 4:21), శిష్యులు (అపొ.కా. 16:1). సహోదరులు (కొలస్స 1:2) అని పిలువబడిరి. ఈ పేర్లు వ్యక్తిగతముగా ఉపయోగించ బడినవి కాని, ఈ పేరులమీద సంఘములు పిలువబడవలెనని కాదు.

కేవలము దేవుడు ఎన్నిక చేసిన నామమును ఎందుకు ధరించవలెననగా :- సంఘము క్రీస్తునకు పెండ్లి కుమార్తె (2కొరింథీ 11:2), దేవుని కుటుంబము (ఎఫెసీ 3:14,15), మనము ఏమి చేసినప్పటికిని క్రీస్తు నామమున చేయుట జరుగవలెను (కొలస్స 3:17). ఏకత్వము సాధించవలెనంటే, ఆ పేరు పెట్టుకొనుట శ్రేయస్కరము.

క్రీస్తు నామముకంటే మించిన నామము, ఘనమైన నామము మరియొకటి లేదు (ఫిలిప్పీ 2:9,11). మత నాయకుడైన లూథర్, తన నామమును గాక, క్రీస్తునామమును ధరించుకొనవలెనని చెప్పెను. జాన్‌వెస్లీ పలుపార్టీలకు తావులేదని చెప్పెను. కాంప్‌బెల్ అమనతడు అందరూ క్రైస్తవులే అనిపించుకొనవలెనని క్రీస్తు నామము ధరించుకొనవలననే అది సాధ్యమగునని క్రోడీకరించెను. మానవుడు రక్షింపబడ వలెనంటే, క్రీస్తు నామమే శక్తిగల నామము (అపొ.కా. 4:12). ప్రతి మోకాలు క్రీస్తు నామమున వంగి, ఆయనకు నమస్కారము చేయవలసినదే (ఫిలిప్పీ 2:9-11).

ఎవరైనా సరే, దేవునిని సంతోషపెట్టుటకు యిచ్ఛ యించినచో, బైబిలులో మనము కనుగొను నామమునే ధరించుకొనవలెను గాని, బైబిలునందు కనబడని నామమును ధరించి, ఆయన నామమునకు అపకీర్తి తేకూడదు.

- A . సత్యవర్ధనరావు.

## రాజ్యము-సంఘము

### ( The Church and Kingdom )

యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతము వచ్చినపుడు మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యుల నడిగెను. వారు-కొందరు బాప్తిస్మమిచ్చు యోహాను, మరికొందరు ఏలియా, కొందరు యిర్మియా లేక ప్రవక్తలలో ఒకడు అని చెప్పుకొనుచున్నారనిరి. అందుకాయన మీరైతే నేనెవడనుకొనుచున్నారని అడుగగా, సీమోను పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. దేవుని వలన బయలుపర్చబడిన ఈ సత్యమను బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుల నిలువనేరవు. ఈ సత్యమును నా తండ్రి వలలనే గ్రహించితివి గనుక నీవు ధన్యుడవు. పరలోక రాజ్యపు తాళపు చేతులు నీకిచ్చెదను (మత్తయి 16:13-20) అని యేసు పేతురుతో చెప్పెను.

## పరలోకరాజ్యము

దేవుని రాజ్యము, పరలోకరాజ్యము అనునవి పర్యాయపదములుగా ఉండి ఒకే భావమును సూచించుచున్నవి (మత్తయి 11:11,; లూకా 7:28). రాజ్యము అనునది గొప్ప బలము గల రాజ్యమును, పరిపాలనను సూచించుచున్నది. దేవుని రాజ్యము దేవునిచే పాలింపబడుచున్నది. పాతనిబంధన క్రిందనున్న ఇశ్రాయేలు రాజ్యముకూడా దేవుని రాజ్యమై యుండెను.

యేసు యూదా మత నాయకులతో ఇట్లనెను : "కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనుల కియ్యబడునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 21:43). ఈ క్రొత్త రాజ్యమే క్రీస్తు ప్రభుని సంఘము (1పేతురు 2:9-10). దానియేలు రోమా రాజ్యమును గూర్చి చెప్పుచూ పలికిన మాట ఏమంటే "ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు.... అది యుగ యుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44).

### పరలోకరాజ్యము సమీపించియుండెను

"పరలోక రాజ్యము సమీపించి యున్నది మారుమనస్సు పొందుడని" బాప్తిస్మమిచ్చు యోహాను బోధించెను ..." (మత్తయి 3:1-2). బాప్తిస్మమిచ్చు యోహాను చెరపట్టబడిన తరువాత యేసు బోధించుట ప్రారంభించినపుడు "పరలోక రాజ్యము సమీపించి యున్నది గనుక మారుమనస్సు పొందుడి అని చెప్పుచు..." (మత్తయి 4:1), చివరగా ఆయన అపొస్తలులను పంపుచూ "పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించుడి" యని వారి కాజ్ఞాపించెను (మత్తయి 10:5-7). మరియు ఆయన డెబ్బదిమందిని పంపుచుకూడా అదే అంశమును ప్రకటింప నాజ్ఞాపించెను. "... దేవుని రాజ్యము మీ దగ్గరకు వచ్చి యున్నదని వారితో చెప్పుడి" (లూకా 10:1,9).

ఆయన "... ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మార్కు 9:1). ఆయన పునరుత్థానుడైన తరువాత ఆయన అపొస్తలులతో ఇట్లనెను: "మీరు పైనుండి శక్తిపొందువరకు పట్టణము (యెరూషలేము)లో నిలిచి యుండుడి" (లూకా 24:49, అపొ.కా. 1:8).

పెంతెకొస్తు దినమందు శక్తి వచ్చెను. అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. (అపొ.కా. 1:4-5, 2:1-4). పేతురు కీర్తన 16:8-11ను తీసుకొని యేసు దావీదు సింహాసనమందు కూర్చొని పరిపాలన ప్రారంభించెనని వివరించెను. "క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు దావీదు ముందుగా తెలుసుకొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను..... మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" అని అతడు బోధించెను (అపొ.కా. 2:25-36).

అనేకులు హృదయంలో నొచ్చుకొని సహోదరులరా మేమేమి చేతుము? అని యడిగిరి. పేతురు వారికిట్లు జవాబిచ్చెను: "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు పరిశుద్ధాత్మ అను వరము మీరు పొందుదురు" (అపొ.కా. 2:37-42). దాదాపు మూడువేలమంది బాప్తిస్మము పొందిరి. అపుడే దేవుని రాజ్యము. మన ప్రభువైన యేసుక్రీస్తు సంఘము భూలోకములో ప్రారంభమాయెను.

ఇక్కడ గమనింపతగిన విషయం ఏమనగా ఆ దినము మొదలుకొని "పరలోకమురాజ్యము సమీపించి యున్నది" అని అపొస్తలులు ఎన్నడును బోధింపలేదు. అక్కడ నుండి వారి వివరణా పద్ధతి ఎట్లున్నదనగా... "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను

ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొల్ల 1:13, హెబ్రీ 12:23, ప్రకటన 1:9).

## రాజ్యము యొక్క లక్షణము

మెస్సీయ రాజ్యముయొక్క నిజస్థితిని గూర్చి యూదులనేకులు పూర్తిగా అపార్థము చేసికొనిరి. వారికి ప్రధమ ప్రతాపము గల భూసంబంధమైన గొప్ప రాజ్యము తిరిగి కావలెననెడి కోరిక గలదు. ఈలాటి తప్పుడు భావముగల బాహ్య చూపు యేసు శిష్యులకు కూడా లేకపోలేదు. గనుకనే పరలోకరాజ్యములో ఎవరు గొప్పవారని వారు యేసు నడిగిరి (మత్తయి 18:1-4). యాకోబు, యోహానులు రాజ్యమందు ముఖ్యస్థానములను ఆవశ్యముగా కోరుకొనిరి గదా ! (మత్తయి 20:20-29; మార్కు 10:35-45). ఆయన పునరుత్థానుడైన తరువాత కూడా "ప్రభువా ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించె దవా ?" అని వారు అడిగిరి (అపొ.కా. 1:6).

అయితే ప్రభువు అది ఆత్మ సంబంధమైన రాజ్యమని పొందికగా వివరించి చెప్పెను. పిలాతుతో ఆయన మాట్లాడిన సందర్భములో ఆయన బోధ ఇట్లుండెను. "నా రాజ్యము ఈ లోకసబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడునట్లు నా సేవకులు పోరాడుదురు. నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను" (యోహాను 18:36).

నీకోదేముతో జరిగిన సంభాషణ ద్వారా దేవుని రాజ్యము యొక్క సహజలక్షణమును తేటగా వివరించి మన రక్షకుడు విశదపర్చెను. "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:1-5). జాతీయత, వంశము, సాంఘిక సమస్యలు, విద్య మొదలైనవి ఆత్మీయ రాజ్యమునకు పనికిరావు.

ఒకడు సువార్త నమ్మి మారుమనస్సు పొంది బాప్తిస్మమునకు లోబడినప్పుడు నూతన జన్మము పొందగలడు, అతడు దేవుని కుటుంబములో శిశువుగను, దేవుని

రాజ్యములో పౌరుడుగను కాగలడు. తిరిగి జన్మించిన స్థితియందు సంఘములో ఉండును. ఇది ఆత్మీయమైన సభ్యత్వము.

## రాజ్యము యొక్క విధి

పేతురు క్రైస్తవులను ప్రోత్సహించుచు వారు పరిపూర్ణులగునట్లు విశ్వాసము నందు సద్గుణమును, సద్గుణమునందు .జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహము ను, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి. "అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసుకొనుటకు మరి జాగ్రత్త పడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును అని హెచ్చరించెను (2పేతురు 1:3-11). ఆ రాజ్యము ప్రాయము కలిగి రక్షించబడిన వారందరిని కలిగియుండును (మత్తయి 8:11). దేవుని పిల్లలు ముందుగా తాము ఎరిగియున్న క్రీస్తు రాకడకై ఎదురు చూచు చున్నారు. అపుడు వారు తమ పరలోక గృహములో ప్రవేశించెదరు. "గాని మన పౌరస్థితి పరలోకమందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము. సమస్తమును తనకు లోబరచు కొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గల దానిగా మార్చును" (ఫిలిప్పీ 3:20-21). "ఆర్భాటముతోను. ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగి వచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు..." "కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి".

క్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు ఈ భూలోకమందు రాజ్యమును స్థాపించి వేయి సంవత్సరముల భౌతిక రాజ్యపాలన చేయునన్నది నిరాధారమైన పచ్చి అబద్ధమే. క్రీస్తు స్పష్టముగా చెప్పెను: "నా రాజ్యము ఈలోక సంబంధమైనది కాదు" (యోహాను 18:36). ఆ రాజ్యము పొందినవారికే చెందుతుంది (దానియేలు

2:44). ఆ రాజ్యమును పొందువాడు అందు జన్మింపవలెను (యోహాను 3:5). దేవుని రాజ్యము క్రీస్తు సంఘము అనే పేరుతో దానిని పొందినవారికి మాత్రం చెందినదై యుండి అభివృద్ధి చెందుచున్నది. క్రీస్తు రెండవసారి వచ్చినపుడు తండ్రియైన దేవునికి ఆయన రాజ్యమును అప్పగించును. అప్పుడు అంతము వచ్చును (1కొరింథీ 15:23-24). యూదులు క్రీస్తు ద్వారా భౌతిక రాజ్యము స్థాపింపబడునని భ్రమచెంది విఫలులైనట్లే నేటి మతశాఖల వారంతా క్రీస్తు వెయ్యేళ్ళపాలన వస్తుందని భ్రమచెంది నిష్ఫలులగుదురు.

- పాల్ గూటం, గొల్లవిల్లి.

ముఖ్య గమనిక : మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడు మాకు వెంటనే తెలియజేయండి. సత్యవాక్కు పత్రికపై యున్న మీ అడ్రసుపై ఉన్న నంబరును తప్పక వ్రాయండి. ఆ నంబరు లేనిదే మీ అడ్రసును మార్చుటకు వీలుపడదు. ఇప్పుడు సత్యవాక్కు మాసపత్రిక ప్రతినెలా పది వేల గృహాలను దర్శించుచున్నది.

మీ బంధువులు, మిత్రులు బేసిక్ బైబిలు కోర్సు లో చేరేటట్లు చేయండి. వారి అడ్రసులను మాకు పంపితే వారికి పోస్టు ద్వారా బైబిలు పాఠములను ఉచితముగా పంపించెదము. బేసిక్ బైబిలు కోర్సు పూర్తిచేసిన వారికి యోగ్యతా పత్రముతో పాటు ఒక బైబిలు ఇప్పుడు బహుమతిగా ఇయ్యబడుచున్నది.

Edited & Published by Joshua Gootam & Printed by him at Satya Vani Publications , Kakinada - 533 004.

# జీవజలం

జీవితేసుడేసుని జీవజలం ప్రవహిస్తోంది
సత్యవాక్కు (వాణి) స్వరూపాన ప్రవహిస్తోంది
బీడు వారిన హృదయ క్షేత్రాల్లో ప్రవహిస్తోంది
ముప్పది అరువది నూరంతలుగా ఫలిస్తోంది !

అనవసరపు ఆకలి దప్పుల నణిచేస్తుంది
అవసరపు ఆత్మీయాహారాన్ని అందిస్తుంది
అనిత్య జీవితం బాపి, నిత్యజీవిత మిస్తుంది
తన్ను గ్రోలిన వారినెల్ల తరింపజేస్తుంది !

కఠిన హృదయాలను కరిగిస్తోంది
కరుణామయ హృదయాలను కలిగిస్తోంది
ఇహలోక వాంఛలను హతమారుస్తోంది
పరలోక వాంఛలను ప్రబోధిస్తోంది!

పాప రోగమును బాగు పరుస్తోంది
పశ్చాత్తాపమును ప్రసాదిస్తోంది
మలిన హృదయాన్ని మంచిగ మార్చేస్తోంది
ప్రభు సేవాపరాయణంలో పయనింప జేస్తోంది !

మతశాఖల తత్వ తిమిరమును మార్చి వేస్తోంది
కూర్మి సోదరత్వమును కుమ్మరిస్తోంది
విరిగి నలిగిన హృదయాన్ని వికసింప జేస్తోంది
మోక్ష మార్గమందు నడువంగ జేస్తోంది !

ప్రతినోట, ప్రతియింట, ప్రతి పేటలో,
ప్రతి పల్లెలో, ప్రతి పట్టణంలో, ప్రతి దేశంలో
ప్రపంచమంతటా - ఇంకా, ఇంకా ప్రవహించాలి,
ప్రభు యేసుని పరిశుద్ధ వాక్యామృత జీవజలం !

- వల్లాటి జోసెఫ్.

## క్రైస్తవ్యం అంటే....?

(Christianity is .... )

క్రైస్తవ్యం అంటే అరణ్యములో ఒక కేక కాదుగాని ఈ లోకంలో ఒక జీవిత అది గాలిలో ఒక బావన కాదు గాని భూమి మీద దేవుని మార్గాన పోవు పాదము అది సీసా క్రింద పెట్టకొనే ఓ విదేశీ వస్తువేమీ కాదు గాని అన్ని రకములై వాతావరణములలోను, పండ్రెండు నెలలలోను ఫలములను ఫలించే వృక్షం. కర్త నిర్వహణలో నమ్మకమే దాని వ్రేళ్ళు, కొమ్మలు. మనము ప్రభువుకేమి చెప్పినను ఆయనను ఎంత ప్రీతికరమైన పదములతో మనం పిలిచినను ఆయన చిత్తమును జరిగించు స్థానాన్ని అవి ఆక్రమించలేవు. ఆయన రాజ్యములో ఆయనతో కూ రొట్టెను భుజించుటలో గల మాధుర్యాన్ని గూర్చి మనము ప్రకటింపవచ్చునేమోగాని ఇప్పుడు ఇక్కడ ఆయన రాజ్యములో మనం దున్ని, విత్తనాలు నాటకపోతే అదంతయు గాలిలోపోసిన పన్నీరే. ఆయనను ఆయన బల్లవద్ద జ్ఞాపకముంచుకొని మన బల్లవ మరచిపోవడం గొప్ప వేషధారణయే. ఆయన చిత్తాన్ని జరిగించుచు మేలు చేయుచు సంచరించుటకంటె మరొకటి మనకు లేదు.

- బాబ్ కా

Edited & Published by Joshua Gootam & Printed by him at.
Satya Vani Publications , Kakinada - 533 004.

BOOK · BOOK POST

From:
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To